# మౌనం నిశ్శబ్దం కాదు



జాపా లక్ష్మారెడ్డి
1917 - 7.11.1986

లక్ష్మారెడ్డి గుబురు మీసాలు, మూడురోజుల గడ్డం, ముడతలు పడ్డ మొహం కరీంనగర్‌లో అందరికీ చిరపరిచితమే. 65 ఏళ్ళ ఆ వృద్ధుడు అక్కడ అందరికీ ఆప్తుడు, ఆత్మీయుడు. వామపక్ష ప్రజాస్వామిక ఉద్యమాలలో, అదీ పోరాటగడ్డ అయిన తెలంగాణలో నాలుగు దశాబ్దాల పాటు క్రియాశీల పాత్ర నిర్వహించడంవల్ల ఆయనకు ఆ జిల్లాలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు, అయాచిత గౌరవం లభించాయి. దీనివల్ల ఏ శత్రువూ తనను ఏమీ చేయలేడనే ధీమా కూడా ఆయనకు ఉండేది. 'నేను యువకుడిగా ఉన్నపుడే రజాకార్లు నన్ను ఏమీ చేయలేదు. ఇవ్వాళ నన్ను ఎవరో ఏదో చేస్తారనే భయం వ్యర్థం' అని ఆయన తన శ్రేయోభిలాషులకు తరచూ చెప్పేవాడు. అయితే ఆయన అంచనా తప్పయింది. ఖాసిం రజ్వీ నాయకత్వంలోని రజాకార్లు చేయలేని పని, 200 మంది భూస్వాములు సాహసించలేని పని ఎన్టీఆర్ పోలీసులు చేయగలిగారు.

కె. బాలగోపాల్

'స్వేచ్ఛ' మాసపత్రిక, డిసెంబర్ 1986

ఆయనను నవంబర్ 7 తెల్లవారుజామున యింటినుంచి బయటకు లాగి కణతకు గురిపెట్టి కాల్చి చంపారు. జాపా లక్ష్మారెడ్డి కరీంనగర్‌కు 4 కి.మీ దూరంలోని అల్లునూరులో వ్యవసాయం చేసేవారు. పదెకరాల

కమతం. పాతికేళ్ళ లోపే తెలంగాణ పోరాటంలో పాల్గొని కొరియర్‌గా పనిచేశారు. దేశ్‌ముఖుల దోపిడీ, ఆర్థిక మాంద్యం ఫలితంగా ఏర్పడిన దారిద్ర్యం ఎలా తామందరినీ కమ్యూనిస్టు రాజకీయాలవైపు నడిపించిందీ ఆయనకు యివాళ్టికీ బాగా గుర్తే. తెలంగాణ పోరాట విరమణ తరువాత కూడా ఆయన అన్ని ప్రజాస్వామిక పోరాటాలకు చేరువలోనే ఉంటూ వచ్చారు. కరీంనగర్ జిల్లా సి.పి.ఐ. కార్యవర్గంలో 1950 నుంచి 1959 వరకు ఉన్నారు. అల్లునూరుకు సర్పంచ్‌గా ఎన్నికై 15 ఏళ్ళపాటు ఆ పదవిలో కొనసాగారు. 1962లో కమ్యూనిస్టు పార్టీ చీలడానికి రెండేళ్ళ ముందే స్వతంత్ర మార్క్సిస్టు గ్రూపులో చేరి పనిచేశారు. 1970 దశకం ప్రారంభంలో (ఆ తరువాత అనేక రాష్ట్రాలకు 'మార్గదర్శకం'గా) ఎన్‌కౌంటర్ హత్యలు ప్రారంభమైనపుడు వాటిని నిరసించిన కొద్దిమందిలో లక్ష్మారెడ్డి ఒకరు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడిగా మహాకవి శ్రీశ్రీ కరీంనగర్ వచ్చినపుడు అక్కడ పౌరహక్కుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది లక్ష్మారెడ్డే. అప్పట్నించీ అంటే 1974 నుంచి ఆయన మా సంఘం కార్యవర్గసభ్యుడని గర్వంగా చెబుతున్నాం.

ఆయన ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల ఉద్యమ నిర్మాతల్లో ఒకరు. 1978లో కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, సిరిసిల్ల తాలూకాలను ప్రభుత్వం కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి పోలీసులకు అసాధారణ అధికారాలు కట్టబెట్టింది. అంతకు ముందే మంథని, మహదేవ్‌పూర్ తాలూకాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించారు. ఆ సమయంలో ఆ జిల్లాలో పౌరహక్కుల ఉద్యమాన్ని నిర్మించే బాధ్యతను స్వీకరించడానికి ఎంతో దీక్ష, ధైర్యం అవసరం. ఆ రెండు ఆయనకు పుష్కలంగా ఉండేవి. ఆనాటి పరిస్థితులకు స్పందించి లక్ష్మారెడ్డి ప్రోద్బలంతో పౌరహక్కుల ఉద్యమంలో చేరిన యువన్యాయవాదులు, అధ్యాపకులు ఎందరో ఉన్నారు. ఎ.పి.సి.యల్.సి. జిల్లా శాఖ అధ్యక్షుడు, కార్యదర్శి హోదాలో ఆయన వారిని మంచి కార్యకర్తలుగా తీర్చిదిద్ది, ఆ తరువాత వారు దాడులకు, అరెస్టులకు, చిత్రహింసలకు, ఆఖరికి హత్యలకు గురికావడాన్ని కూడా కళ్లారా చూడవలసి వచ్చింది. నిర్బంధాన్ని భరించలేక తప్పనిసరై చాలామంది రాజీనామా చేసి సంస్థనుంచి తప్పుకున్నా ఆయన మాత్రం చెక్కు చెదరకుండా చివరికంటా నిలిచారు.

కరీంనగర్ జిల్లాలో గత ఏడాది కాలంగా ఎన్ని ఎన్‌కౌంటర్లు జరిగినా నిజనిర్ధారణ కమిటీలు వెళ్ళలేని పరిస్థితి ఏర్పడితే, కనీసం వీటిని ఆపడంకోసం అక్రమనిర్బంధంలో ఉన్న వ్యక్తుల గురించి ఆయన ఎప్పటికప్పుడు పత్రికా ప్రకటనలు యిచ్చేవారు.

భారతదేశంలోని పౌరహక్కుల సంఘాలన్నింటికీ నిజనిర్ధారణే అన్నిటికంటే పెద్ద పని. (మరే దేశంలోని పౌరహక్కుల సంఘాలు యింతగా నిజనిర్ధారణ చేయవలసిన అవసరం

ఉండదు.) కాని కరీంనగర్‌లోని కల్లోలిత ప్రాంతాలలో భయం దాదాపు భౌతికరూపం దాల్చి ఎవరినీ నోరు మెదపనివ్వదు. ఆర్వాల్ మారణ కాండ తరువాత బాధితులు జర్నలిస్టులతో, పౌరసంఘాల వాళ్ళతో స్వేచ్ఛగా మాట్లాడగలిగారు. కాని కరీంనగర్ గ్రామాల్లో అది చాలా కష్టసాధ్యం. అటువంటి భయానక పరిస్థితుల్లో కూడా లక్ష్మారెడ్డి వారిచేత మాట్లాడించ గలిగేవారు. వారు తమ కష్టాలు చెప్పుకునేట్టు చేయగలిగేవారు. వాళ్ళలో ఒకడుగా కలిసిపోవడమే యిందుకు ముఖ్య కారణం. దీనివల్ల ప్రజాస్వామిక ఉద్యమానికి ఆయన ఎంతో విలువైన వ్యక్తిగా మారితే ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులకు ద్వేషపూరితుడయ్యాడు.

'బహిరంగ సభలు పెట్టలేకపోవచ్చు. కరపత్రాలు అచ్చేసి పంచలేకపోవచ్చు. పోలీసు అత్యాచారాలను, హత్యలను పరిశోధించలేకపోవచ్చు. కాని అక్రమ నిర్బంధం గురించి ప్రపంచానికి తెలిపి ఎన్‌కౌంటర్ హత్యను ఆపే ప్రయత్నం చేయకుండా మమ్మల్ని ఎవరూ ఆపలేరు' అని ఆయన నిర్భయంగా చెప్పేవాడు. ఈ ఏడాది మేలో 'ఫియర్ వికాస్' బంద్ సందర్భంగా పోలీసులు ఆయన యింటిపై దాడిచేసి, కొడుకును కొట్టి మీ అయ్యను చంపుతామని బెదిరించినా లక్ష్మారెడ్డి బెదిరిపోలేదు. చనిపోవడానికి కొద్దిరోజులు ముందు కూడా మంథని ఆంధ్రజ్యోతి విలేఖరిని పోలీసులు అరెస్టుచేస్తే దాన్ని ఖండిస్తూ ఆయన ఒక ప్రకటన యిచ్చారు.

నవంబర్ 6వ తేదీ రాత్రి కొందరు నక్సలైట్లు పెద్దపల్లి డి.ఎస్.పి.ని హత్య చేశారన్న కోపంతో, అంతకుముందు వరంగల్ పోలీసులు నెలకొల్పిన 'ఆదర్శం' ప్రకారం కరీంనగర్ పోలీసులు జిల్లాలో నిర్భయంగా సంచరిస్తున్న ఏకైక పౌరహక్కుల నాయకుడిని కాల్చి చంపారు. అణచివేత సైతం సాధించలేని ఆయన మౌనాన్ని ఎట్టకేలకు భౌతికంగా సాధించామని వారు విర్రవీగుతుండొచ్చు కానీ ఆయన మౌనంగా లేరు. ఈ సారి తనమీదే జరిగిన అత్యాచారాన్ని నిర్జీవంగా ఉండి కూడా ప్రపంచానికి ఎలుగెత్తి చాటుతున్నారు.